# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హస్తకళ సాంస్కృతిక గుర్తింపు మాత్రమే కాదని, ప్రజల జీవనోపాధిలో ముఖ్యమైన భాగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ భారత జాతీయ గేయం వందేమాతరం దేశభక్తికి, త్యాగానికి, జాతీయ చైతన్యానికి చిహ్నంగా నిలిచి.. స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గం సుగమం చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ పౌర విమానయానంలో భద్రత రాజీపడలేని అంశమని, అత్యున్నత అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు భారత్ కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.
- ❖ దేశంలోని మధ్య, తూర్పు, ఉత్తర ద్వీపకల్ప ప్రాంతాలలో చలిగాలుల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.
- ❖ కటక్ లోని బారాబతి స్టేడియం వేదికగా భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

====================

హస్తకళ కేవలం సాంస్కృతిక గుర్తింపు మాత్రమే కాదని, ప్రజల జీవనోపాధిలో ఇది ఒక ముఖ్యమైన భాగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. జాతీయ హస్తకళల అవార్డులను రాష్ట్రపతి న్యూఢిల్లీలో ఈ రోజు ప్రదానం చేశారు. దేశంలోని అత్యుత్తమ కళా నైపుణ్యాన్ని గుర్తించడంలో భాగంగా 2023, 2024 సంవత్సరాలకు గాను 12 మంది కళాకారులకు `శిల్ప్ గురు అవార్డులు`, 36 మంది కళాకారులకు `జాతీయ అవార్డుల`ను అందజేశారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... హస్తకళ రంగం దేశంలో 32 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోందని, వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారేనని తెలిపారు. ఈ రంగంలో పని చేసే వారిలో 68 శాతం మంది మహిళలే ఉన్నారని రాష్ట్రపతి ముర్ము తెలియజేస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ఈరోజు చర్చ జరుగుతోంది. ఈ చర్చలో పాల్గొన్న కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని అనేకసార్లు నిర్వహించారని, అయితే ఇప్పుడు ప్రతిపక్షాలు ఈ ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తడం సరికాదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు లభించిన దేశ ఓటింగ్ వ్యవస్థను ఆయన ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పౌర విమానయానంలో భద్రత రాజీపడలేని అంశమని, అత్యున్నత అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు భారతదేశం కట్టుబడి ఉందని ఆ శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. ఇండిగో విమాన సర్వీసులు పెద్ద ఎత్తున రద్దు కావడంపై లోక్‌సభలో మంత్రి ఈ రోజు మాట్లాడుతూ... ఈ సంక్షోభానికి ఇండిగో పూర్తిగా బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) ఇప్పటికే విమానయాన సంస్థకు నోటీసులు జారీ చేసిందని, ఆ నివేదిక ఆధారంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం-కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు 21 విడతలుగా నాలుగు లక్షల కోట్ల రూపాయలకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అదే విధంగా దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 35 కోట్ల 70 లక్షల టన్నులుగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 7.65 శాతం అధికమని పేర్కొనారు. రైతుల కృషి, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగానే ఇది సాధ్యమైందని మంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) రెండవ దశ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 99.97 శాతం ఓటర్లకు గణన ఫారాలను పంపిణీ చేసినట్లు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తెలిపింది. ఇప్పటివరకు దాదాపు 50 కోట్ల ఫారాలు డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు కమిషన్ పేర్కొంది. కేరళ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలలో గణన ఫారాలను సమర్పించడానికి గడువు ఈ నెల 11వ తేదీగా నిర్ణయించామని, కేరళలో మాత్రం డిసెంబర్ 18 వరకు గడువు ఉందని తెలిపింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో నవంబర్ 4న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశ మొదలైంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

భారత జాతీయ గేయం 'వందేమాతరం' దేశభక్తికి, త్యాగానికి, జాతీయ చైతన్యానికి చిహ్నంగా నిలిచి, స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గం సుగమం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. వందేమాతరం గేయానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాజ్యసభలో ఈరోజు చర్చను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో, ప్రస్తుత పరిస్థితులలో, అలాగే 2047 నాటికి దేశం `వికసిత్ భారత్`గా మారినప్పుడు కూడా

వందేమాతరం అవసరం ఉందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం ద్వారా దేశాన్ని తల్లిగా పూజించే సంస్కృతిని, సాంప్రదాయాన్ని, సాంస్కృతిక జాతీయవాదాన్ని స్థాపించారని అమిత్ షా తెలుపుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (PM-JAY) కింద గత ఆర్థిక సంవత్సరంలో 28 వేల కోట్ల రూపాయల విలువైన 2 కోట్లకు పైగా క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రభుత్వం తెలిపింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం కింద ఇప్పటివరకు గృహ రంగంలో మొత్తం 7 వేల మెగావాట్ల (MW) రూఫ్‌టాప్ సోలార్ ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ఈరోజు తెలిపింది. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ సమాధానమిచ్చారు. ఈ పథకం 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి గృహ రంగంలో కోటి ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, దీనికి 75 వేల 021 కోట్ల నిధులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మధ్య, తూర్పు, ఉత్తర ద్వీపకల్ప (పెనిన్సులర్) ప్రాంతాలలో చలిగాలుల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) ఈరోజు తెలిపింది. వాయువ్య భారత్‌తో సహా ఈ ప్రాంతాలలో ఈ నెల 12 వరకు చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని అంచనా వేసింది. రాబోయే రోజుల్లో హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, అస్సాం, మణిపూర్ రాష్ట్రాల్లో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ ఈ రోజు కటక్ లోని బారాబతి స్టేడియం వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. భారత్ 19 ఓవర్లకు 6 వికెట్లు నష్ట పోయి 163 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 102 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 436 పాయింట్లు నష్టపోయి 84 వేల 666 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 120 పాయింట్ల నష్టంతో 25 వేల 839 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 88 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 206 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఇటీవల ఇండిగో విమాన సర్వీసులు పెద్ద ఎత్తున రద్దు, ఆలస్యం కావడంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) కఠిన చర్యలు చేపట్టింది. అన్ని సెక్టార్లలో విమాన సర్వీసుల షెడ్యూల్‌ను 5 శాతం మేర తగ్గించుకోవాలని ఇండిగో సంస్థకు డీజీసీఏ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా అధిక డిమాండ్, అధిక ఫ్రీక్వెన్సీ ఉన్న విమాన సెక్టార్లలో ఈ రద్దు వర్తిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =